రేపు డ్రీమ్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో 4కె రన్

కుత్బుల్లాపూర్: కొంపల్లి డ్రీమ్ ఫిట్‌నెస్ స్పోర్ట్స్ మీట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం 4కె రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5:30 నుంచి 7: 00 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ మీదుగా రిలయన్స్ పెట్రోల్ బంక్ వరకు.. తిరిగి డ్రీమ్ ఫిట్నెస్ వరకు ఫోర్ కె రన్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇందులో సుమారు 150 మంది పాల్గొంటారని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, పేట్ బషీరాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే ను నిర్వహించారు. బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులను ఉద్దేశించి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీటెక్ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌కు పునాదిలాంటిదని, కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ వారికి మార్గదర్శకులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ ప్రొఫెసర్ రవీంద్ర, అకాడమిక్ డీన్ రామకృష్ణం రాజు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

3 కిలోల గంజాయి సీజ్



కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయదారుడి నుంచి 3 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 11న జీడిమెట్ల గాంధీ విగ్రహం సమీపంలోని డెకత్లాన్ స్టోర్ వద్ద ఉప్పల్‌కు చెందిన రవితేజ(21) అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలు చేపట్టగా 3 కిలోల గంజాయి పట్టుబడింది. అతని విచారించగా మున్నా అనే వ్యక్తి గంజాయి సరఫరా చేసినట్లు అంగీకరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నాలా డైవర్షన్ పనులు పూర్తి చేయాలి

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



ఫాక్స్‌సాగర్ నాలా డైవర్షన్ పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఫాక్స్‌సాగర్ చెరువులో మురుగు నీరు చేరకుండా నాలా డైవర్షన్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సుభాష్‌నగర్‌ను ఆనుకుని రూ.2.40 కోట్లతో చేపడుతున్న ఫాక్స్‌సాగర్ నాలా పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫాక్స్ సాగర్‌లో మురుగు నీరు కలవకుండా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగును డైవర్షన్ చేసేందుకు చేపడుతున్న పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసినట్లయితే చెరువు పరిరక్షణతో పాటు మత్స్యసంపద పెంపొందుతుందన్నారు. చెరువు చుట్టూ ఆహ్లాదభరిత వాతావరణాన్ని పెంపొందించి మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు యత్నిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రామారావు, నాయకులు సురేష్‌రెడ్డి, పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, లక్ష్మీనారాయణ, సిద్ధిరాములు, కమలాకర్, మధు మోహన్ తదితరులు ఉన్నారు.

◆ చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సీనియర్ నాయకుడు డేగ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. చింతల్, చంద్రా నగర్, భగత్ సింగ్ నగర్, దుర్గయ్య నగర్, రంగా నగర్, స్టార్ లైట్ అపార్ట్‌మెంట్, స్ఫూర్తి నగర్, ఆదర్శ్ నగర్, వైఎంఎస్ కాలనీ, సాయి కాలనీ, శివా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఉన్నారు

జ్ఞానాన్ని పెంచే దైవాలు ఉపాధ్యాయులు

కుత్బుల్లాపూర్: మనకు జీవాన్ని ఇచ్చే దైవం తల్లిదండ్రులైతే, జ్ఞానాన్ని పంచే దైవం ఉపాధ్యాయులని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జెమిని కుమారి, కృష్ణ, రామకృష్ణ, పీఆర్టీయూ, టీఎస్టీయూ, ఎస్టీయూ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

స్కాలర్‌షిప్‌ల కోసం దీక్ష చేస్తే అరెస్టులా?

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్



రంగారెడ్డినగర్: విద్యార్థుల సమస్యలపై గళమెత్తితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అణగదొక్కేందుకు యత్నిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్, కార్తిక అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన టెంట్‌ను పోలీసులు తొలగించి వారిని స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల హక్కుల కోసం దీక్షకు దిగితే రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తోందని, అక్రమ అరెస్టులు తమ పోరాటాలను ఆపలేవన్నారు. దీక్ష విషయమై నాలుగు రోజుల క్రితమే పోలీసులకు సమాచారం ఇచ్చామని, అయినా తమ దీక్షా శిబిరాన్ని తొలగించడం అప్రజాస్వామిక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి భగత్, మండల ఉపాధ్యక్షుడు వశిష్ట, మల్లికార్జున్, మందీప్, నాయకులు రాకేష్, కౌశిక్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌లో వసతులు కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో సదుపాయాలను మెరుగుపరచాలని కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణ సరిగా లేదని, దీంతో టాయిలెట్లు కంపు కొడుతున్నాయన్నారు. శుభకార్యాలకు వచ్చే ప్రజలకు తాగునీటి వసతి, లైట్లు వెలగక, ఫ్యాన్‌లు తిరగక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంట్రన్స్ గేటు వద్ద చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తుందన్నారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణకు నిధులు మంజూరు చేసి వసతులను మెరుగుపర్చాలని కోరారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కోలా వెంకటేష్

సుభాష్‌నగర్: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఉపాధ్యాయుడు చేసే కృషి వెలకట్టలేనిదని నార్త్ సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సూరారం కాలనీ ప్రభుత్వ ఉపాధ్యాయులను శుక్రవారం సూరారంలోని నార్త్ సిటీ స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించేవాడే ఉపాధ్యాయుడని పేర్కొన్నారు. తాను చదువుకున్న, తన తండ్రి ఉపాధ్యాయునిగా పనిచేసిన పాఠశాల ఉపాధ్యాయులను ప్రతి సంవత్సరం సన్మానం చేయడం గర్వంగా ఉందన్నారు.

శ్మశానవాటికను పరిశీలించిన అధికారులు



చింతల్: గాజులరామారం సర్కిల్ భగత్‌సింగ్‌నగర్ పరిధిలో ఉన్న చింతల్ శ్మశాన వాటికను శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించారు. సుమారు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరగగా.. నిధులలేమితో మోడ్రన్ ఫంక్షన్ హాల్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఇటీవల బస్తీల నాయకులు సమావేశమై శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులకు నివేదించారు. దీంతో శుక్రవారం ఆయా బస్తీల సంక్షేమ సంఘాల నేతలతో కలిసి అధికారులు శ్మశాన వాటికను పరిశీలించారు. నిలిచిన పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఈఈ కిష్టప్ప హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాజులరామారం డీఈ విశాలాక్షి , ఏఈ అశోక్, న్యాక్ ఇంజినీర్ నాగరాజు, నాయకులు కొట్టే రాధికా సదానంద్, డేగల కృష్ణమూర్తి, బండారు వరప్రసాద్, శ్రీశైలం యాదవ్, 16 కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కుత్బుల్లాపూర్: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ కార్యాలయంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ఏచూరికి ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కరుణాకర్, దుర్గానాయక్, వీరేష్, సురేష్, కార్తిక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

జగద్గిరిగుట్ట: స్థానికంగా బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరించాలని మైసమ్మనగర్ కాలనీ ప్రజలు ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా నీటి ఎద్దడిని నివారించేందుకు రెండు బోర్లు వేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈటల రాజేందర్ త్వరలోనే బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మైసమ్మనగర్ బీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బసవప్ప, ప్రధాన కార్యదర్శి బండారి రవీందర్‌రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, బస్తీ పెద్దలు ఎల్‌బీసీ వెంకటేశ్, పత్తెపురం శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సాయి కిరణ్, వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.